రంగారావూ నేనూ బాల్య స్నేహితులం.

బడి ఆవరణలో తంగేడు చెట్లమీద కోతి కొమ్మచ్చు లాడటం; మద్దికాయలు కోసి వాటిని కొబ్బరి ఈనెలకి గుచ్చి గాలి లోకి ఎగరేస్తూ అవ్వాయి చువ్వాయి లాడటం; మా పెరట్లో వేసవి సెలవల మధ్యాహ్నాలలో పదిమంది పిల్లల్ని పోగేసి వాళ్ళకి పోటీ పరీక్షలు పెట్టి బలపాలు బహుమతులుగా యివ్వడం- ఇలా అనేకానేక కార్యక్రమాల్లో మేమిద్దరమూ వొక జట్టుగా, భాగస్వాములుగా వుంటూ వుండే వాళ్ళం—గోదావరి సాక్ష్యంగా!

రంగారావ్ వాళ్ళది కలిగిన కుటుంబం కిందే లెఖ్ఖ. ఎస్సెల్సీతో చదువు ఆపి వ్యవసాయంలో పడిపోయాడు అతను. నేను విశాఖపట్నం పోయాను—పై చదువుల కోసం.

విశాఖలో డాక్టరుగా బోర్డు కట్టినా, రాజమండ్రితోనూ, రంగారావ్ కుటుంబంతోనూ నా పరిచయం అలాగే సాగిపోతూ వుంది.

పెళ్ళి పేరంటాలు పూర్తిచేసి, కుటుంబాల్ని స్థిరపరిచి, రంగారావ్‌కి వో కూతుర్నీ, నాకొక కొడుకునీ యిచ్చి—తన పరిణామ ధర్మాన్ని తాను నెర వేర్చింది కాలం.

రంగారావ్ చెల్లెలు వరమ్మ పెళ్ళి గొడవలూ అవీ— అతని తండ్రికీ, అతనికీ, కొంత క్షోభనీ, కొన్ని అవాంఛనీయ పరిస్థితుల్నీ కలిగించటం, వాటి వివరాలూ నాకు బాగానే తెలుసు.

పాతికేళ్ళ తర్వాత—ఇప్పుడూ రంగారావ్‌కీ నాకూ మధ్య ఆ సాన్నిహిత్యం, చనువు, ఆత్మీయత, అనుబంధం, మైత్రీ- అన్నీ అలాగే నిలిచి వుండటం మా యిద్దరి అదృష్టమూను.

ం ం ం

రంగారావ్ కారాలూ మిరియాలూ నూరటం ఆపి భార్యకేసి సాలోచనగా చూసాడు; 'నీఅభిప్రాయం ఏవిటి' అన్నట్టు.

వసుంధర చీరెకి 'ఫాల్స్' కుట్టుకుంటోంది.

"మీరనేదే బాగుంది. మీ వుద్దేశ్యం అమ్మాయికి చెప్తాం"

"చెప్పటం కాదు, చెప్పి, ఒప్పించాలి. మొన్న ఆ మాటని తాను మాటవరసకే అన్నదో, మనస్ఫూర్తిగానే అన్నదోగానీ— నాకు మాత్రం అప్పట్నుంచీ, వొళ్ళంతా దురదగుంటాకు పులిమినట్లే వుంది"—ఒకసారి కుర్చీలోంచి లేచి హాల్లో వో మూలకి నడిచి, అక్కడ టేబుల్ మీది దిన పత్రికని చేతుల్లోకి తీసుకుని, నాలుగు మడతలు వేసి ఎడమ అరచేతిలో వోసారి కొట్టుకుని-మళ్ళీ దాన్ని టేబిల్ మీద గిరాటేశాడు. వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"చిన్నంతరం పెద్దంతరం లేకుండా ఇలా మాట్లాడ కూడదని కూడా చెప్పు"

'ఊ' అని దీర్ఘం తీసింది వసుంధర.


రంగారావ్ ఈసారి తన కెదురుగా వున్న టీపాయ్ మీది వార పత్రికని తిరగేయసాగేడు.

"శారద జోక్‌గానే అని వుంటుంది. ఈ యింటి మీది కాకి ఆ యింటిమీద వాలి పాతికేళ్ళయిందని దానికి తెలుసు. ఇన్నాళ్ళకి మళ్ళీ ఈ అభిమానాలూ, ప్రేమలూ మనకేం వద్దు. ఎంత పూసుకుందామన్నా అంటనిది అంటనే అంటదు. అది పసిపిల్ల. దానికేం తెలుసు?"

రంగారావ్‌కి వసుంధర సంభాషణ నచ్చింది. సంతృప్తిగా నిట్టూర్చేడు. మొహాన్న అప్పటి వరకూ తాండవించిన మిట్ట మధ్యాహ్నపు ఎండ పలచబడింది.

"శారదతో నేను వివరంగా మాట్లాడుతానులెండి. వరమ్మంటే అత్తయ్య అనే దాని ఊహ. ఆవిడ అతిశయం, గర్వం— అన్నింటినీ మించి ఆమె పట్టుదల—ఇవన్నీ శారదకేం తెలుసు?"

"ఆయన చేసిన నిర్వాహకం మాత్రం






ఏపాటిది? మానాన్న అన్న ఒకే వొక్క మాటకి బంధాలన్నీ తెంచేసుకు పోయాడు. పైగా ఎంతరాద్ధాంతంచేశాడు? తలచుకుంటే ఇప్పటికీ రక్తం మరిగిపోతుంది. ఎంతైనా ఆడపిల్ల వాళ్ళం కదా అని మేమంతా సర్దుకు పోదలచుకుని చప్పబడ్డామా? ఆ తర్వాత మాత్రం - సంక్రాంతి పండక్కి రమ్మని కబురుపెత్తే, పెద్దవాడనే గౌరవం కూడా లేకుండా— 'ఏదో వో మిషతో నన్ను దువ్వాలని ప్రయత్నించకండి. కాశీ పతి పట్టుదలంటే కాటితో పోవాల్సిందే. ఇక మీదట ఆ యింటి నుంచి ఏ వార్తలు అందినా తలలు తెగుతాయ్' అని సమాధానం పంపుతాడా?"

"ఇంతకీ మా నాన్న చేసిన అంత ఘోరమైన నేరం, ఏమిటి? 'మా వరమ్మ అమాయకురాలు కనుక నీ వలలో పడింది. దాని సుఖాన్నే ఆశించాను కనుక నేనూ తలవూపేను. లేకపోతే ఈ కులహీనపు పెళ్ళి జరిగేదే కాదు' అన్నాడు. అంతేగా"— ఉక్రోషంగా గద్దించాడు రంగారావ్.

"నిజం మాట్లాడితే నిష్ఠూరంగానే వుంటుంది మరి. మీ చెల్లెలు ఆయనకే వంతపాడి ఈ పాతికేళ్ళూ పుట్టింటి పసుపు కుంకుమనే వద్దనుకుని భీష్మించుక్కూర్చోలా? చెల్లెలు కదా అని మీరు మెత్తబడితే పడతారేమో – ఎందుకైనా మంచిది—నేను ముందే నిక్కచ్చిగా చెప్తున్నాను. ఈ సంబంధం నాకు సుతరామూ ఇష్టంలేదు.'

చీరెని పక్కన పడేసి కుర్చీలో సర్దుకు కూర్చుంది— వసుంధర.

రంగారావ్‌కి కొంచెం చిరాకేసింది. విసుగ్గా భార్యకేసి చూసేడు.

"చొప్పదంటు సందేహాలు తీసుకురాకు. నేను మెత్తబడే ప్రసక్తే లేదు. ఆనాడు మానాన్న కులహీనంపెళ్ళి అని మాత్రమే అన్నాడు. ఈ నాడు నేను కులహీనపెళ్ళే కాదు, వరహీనపెళ్ళి అని కూడా అనాల్సొస్తుంది. శారద ఎం.ఏ. రేపో మాపో డాక్టరేట్ కూడా తీసుకుంటుంది. అదిప్పుడు లెక్చరర్. వాడో-ఇంటర్ పాస్తై-చేతులకి మకిలీ, వొంటికి మడ్డీ, మొఖానికి జిడ్డూ పట్టించుకుంటున్నాడు - కార్లు బాగు చేసుకుంటూ."

ఎద్దేవగా అన్నాడు.

"గోళ్ళు గిల్లుకుంటూకూర్చున్నా రెండు తరాలకు సరిపడే ఐశ్వర్యం వుందిగా. అదీ, వాళ్ళ ఘనతా, గర్వమూ" వసుంధర లేచి వంటింటి కేసి నడిచింది.

"ఆ ఘనతలూ, గర్వాలూ నా పిల్ల పదోతరగతి మార్కుల ముందు బలాదూరు" వెటకారంగా అని, కాళ్ళు రెండు పైకి పెట్టుకుని ఊపిరి పీల్చేడు రంగారావ్, ఛాతీ నాలుగంగుళాలు పెరిగినట్లయిందాయనకు.

మరు క్షణంలో శారద మొన్న సాయంత్రం అన్న మాటలు గుర్తుకొచ్చినై. గాలి తీసిన బెలూన్‌లా వాలుకుర్చీలో జారిపోయాడు.

ం ం ం ం

మొన్న—

ఆదివారం—


నేనూ, మా అబ్బాయి సింహాచలం కలసి కార్లో రాజమండ్రి వచ్చాం. 'అమ్మని తీసుకు వెళదాం' అన్నాడు సింహాచలం తీరా బయల్దేరే ముందు.

"ఈసారి వస్తుందిలే – ఇవ్వాళ వద్దు. ముగ్గురం వెళ్ళటం ఎందుకులే" అన్నాన్నేను. రమాదేవి నా మాటకు సరే నంది.

—రంగారావ్‌తో చిన్ననాటి ముచ్చట్లలో పడ్డాను నేను. రీడర్‌గా తన అనుభవాలూ, యూనివర్శిటీ కబుర్లూ శారదకి చెప్తూ, లెక్చరర్‌గా ఆమె కాలేజీ విశేషాలు తాను వింటున్నాడు-సింహాచలం. వసుంధర రాత్రి భోజనాలకి ఏర్పాట్లు చేయడంలో 'బిజీ' గా వుంది.

భోజనాలైనాక అంతా ఆరు బయట కుర్చీల్లో కూర్చున్నాం. 'వాతావరణం చాలా బాగుందిరా గుర్నాథం' అన్నాడు

పందెయ్యాతలో నిజం గుర్రంగావాలంటుం టేవంట ఉదిలో బడ్జెట్ సినేమా అని సెప్పినగందా.



రంగారావ్.

దశమి వెన్నెల వెలుగు నీడల చదరంగ పాళీని గీస్తోంది—వేప చెట్టు మీదుగా చల్లటి గాలి ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. పిట్టగోడ బయట పిల్లలు కేరింతలు కొట్టూ ఆడుకుంటున్నారు. దూరంగా ఎక్కడనుంచో 'భళారే విచిత్రం'—సినిమా పాట మంద్ర స్థాయిలో వినిపిస్తోంది.

సంభాషణ పెళ్ళిమీదకి మళ్ళింది.

నేనే మొదలెట్టాను.

"మన రెండు కుటుంబాల మధ్యా వున్న అనుబంధం దృష్ట్యా మనం సంబంధాలు కూడా కలుపుకుంటే బాగుటుందని నా వుద్దేశ్యం. దీనికి తోడు మా సింహాచలం మనస్సు మీకు తెలుసు. వాడు శారద మీద అభిమానాన్నీ, మమతనీ పెంచుకున్నాడు. తన మనస్సులో మాటని నాకు చెప్పిన మీదట నాకూ ఏనుగెక్కినంత సంబరం కలిగింది. మా కోరికని మీరూ కాదనరనే నమ్మకం నాకుంది."

రంగారావు, వసుంధరా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. సింహాచలం వాళ్ళ సమాధానం కోసం ఉత్సుకతతో కుర్చీలో మసిలేడు. రంగారావూ, వసుంధరా మొహాల్లో తొణికిసలాడిన ఆనందాన్ని నేను గమనించి సంతృప్తిగా ఊపిరి పీల్చుకున్నాను.

క్షణాల తర్వాత వసుంధర అన్నది, "సిరిరా మోకాలొడ్డే అవివేకం మాకు లేదు గానీ అన్నయ్యా - డాక్టరుగారి అబ్బాయి, రీడరు గారు—మేం తూగగలమా అని సందేహం" సన్నగా నవ్వింది ఆమె.

"మమ్మల్ని మరీ చెట్టెక్కించకండి" అన్నాడు సింహాచలం. నాకూ ఆ మాట

నచ్చింది.

"ఇందులో మా అభిప్రాయాలెప్పుడూ మీకు అనుకూలంగానూ, మీ దొడ్డ మనసు మాకు అనుకూలంగానూ వుంటాయని మనకు తెలుసు గానీ—శారద అభిప్రాయం కూడా కనుక్కుందాం" అన్నాడు రంగా రావ్.

అందరి చూపులూ ఆమె కేసి తిరిగినై.

శారద ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా, "మీరు చెప్పేవన్నీ నిజమే గానీ—నా పెళ్ళి గురించి అక్కడా యిక్కడా సంబంధాలు చూడటం ఎందుకు నాన్నా, బావలేడూ" అనేసి అక్కణ్ణుంచి జారుకుంది. అదీ ముసి ముసి నవ్వులతో!

శారద మాటలకి విస్తుపోవడం మా నలుగురి వంతయింది.

○ ○ ○ ○

"మీరు ఇప్పటి వరకూ వేసిన అక్షింతలూ; ఇక ముందు చేయబోయే హెచ్చరికలూ — అన్నీ కథల్లో చదివీ చదివీ, సినిమాల్లో వినీ వినీ విసుగెత్తిపోయింది. నా నిర్ణయం నేను చెప్పేశాను గదా. అంతే"

శంకరం సైకిల్ని వసారా గుమ్మం దాటిస్తూ చెప్పేశాడు.

"ఇవతల ముఖ్యమైన విషయాలు మాట్లాడుతుంటే, వినా వినుకోమని అలా తృణీకరించి పోవడం వాళ్ళ పొగరుకి నిదర్శనం మరి" -కాశీపతి కొడుకు నిర్లక్ష్యానికి ఉగ్రుడై పోయాడు.

"లోపలికి రారా-తర్వాత వెళ్ళొచ్చు" అంది వరమ్మ,

"ఈ విషయం గురించి ఇంక మాట్లాడాల్సిందేమీ లేదు. నాకు పనుంది అవతల" అని వెనక్కి తిరక్కుండానే ముందుకు నడిచేడు శంకరం.

"తల బిరుసుదనం...." అని పళ్ళు కొరికేడు కాశీపతి.

"వాడి పాట్లు వాడు పడతాడు; పోనీండి మాట వినని పెంకి ఘటాల్ని మనమేం చేస్తాం" —వరమ్మ,

"ఏమీ చెయ్యొద్దు. చేతికి గాజులు తొడిగించుకుని కూర్చుంటా నేను కూడా—సరేనా?" ఎగిరిపడ్డాడు, కాశీపతి.

భర్త సంగతి వరమ్మకి తెలుసు. తను సమాధానం చెప్పినకొద్దీ రెచ్చి పోతాడు ఆయన. అందుకే ఇంక తను మౌనం వహించటం మంచిదనుకుని ఊరుకుంది.

"అంత ఆపిల్లే బెల్లమనుకుంటే—ఈ ఇంట్లో నుంచి బయటికి పోయి గోదార్లో దూకమను. నా గౌరవం తన కళ్ళల్లేక పోయిన తర్వాత-తన బాగోగులూ మనకనవసరం." కాశీపతి ధూము ధాములు చేస్తూనే వున్నాడు.

వరమ్మ లోగదిలోకి నడిచింది.

"తల్లి దండ్రుల్ని క్షోభపెట్టి, శత్రు వర్గంలోకి చేరి తను పడబోయే పాట్లు వాడికి తెలీవు. మూణ్ణాళ్ళ పట్టపగల్లో ఆ మోజు తీరుతుంది. ఇద్దరూ బొచ్చె పట్టుకు బయల్దేరతారు" కాశీపతి శాపనార్థాలు మొదలెట్టాడు

○ ○ ○

శారద-శంకరం పెళ్ళి చేసుకున్నారు. పెళ్ళికి రంగారావూ వసుంధర గానీ, కాశీపతీ—వరమ్మ గానీ, రమాదేవి సింహాచలంగానీ రాలేదు. ఎవరిళ్ళల్లో వాళ్ళు చిందులు వేసారు.

శారద—శంకరం తమ పేర్లమీదే శుభలేఖలు అచ్చొత్తించుకుని వీళ్ళందర్నీ పిలిచారు.

పెళ్ళి కాకినాడలో జరిగింది — చాలా నిరాడంబరంగా. నేనూ మరో నలుగురు మిత్రులూ—అప్పుడున్నది.

వీళ్ళ పెళ్ళి వలన నాకో గొప్ప సత్యం తెలిసింది. పెళ్ళి కూడా పుట్టుక లాగానే యాక్సిడెంట్ అని.

శంకరం తన మకాం కాకినాడ





హిందుస్థాన్ లివర్ వారి ఉత్పత్తి.

మార్చేడు. శారద ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నాలు మొదలెట్టింది - కాకినాడకు.

ఇరువైపులా తల్లిదండ్రులు సంబంధాలు తెంచేసుకుని, దుఃఖాన్ని పెదవుల మీద బిగబట్టుకుని, భేషజాన్నీ పట్టుదలనీ మొహాన్ని చెండుకుని భీష్మించుకూర్చున్నారు. కొత్త దంపతులు మాత్రం ఈ పరిస్థితుల్ని చిరునవ్వుతోనే స్వీకరించారు.

కంచు మరచెంబుకు తేలు కుట్టినట్టు నాకు గుండెల్లో ఎక్కడో సన్నని బాధ ఇదమిత్థంగా ఎందుకో చెప్పలేను.

పెళ్ళి నుంచి తిరిగి విశాఖ వచ్చాను. సింహాచలం వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. వాడి ముఖంలో ఆవేదన, కళ్ళల్లో బాధ—కొట్టొచ్చినట్టే కనిపించినై.

వాళ్ళొక్కొక్కళ్ళ ఎదకూ ఎన్నెన్ని గదులున్నాయా అనిపించింది నాకు—

మజ్జిగ తెచ్చేముందరే ఉప్పుగల్లు అడగటం ఎందుకులే అన్నట్టు – వాళ్ళ సంసారం గురించి, వాళ్ళ భవిష్యత్తు గురించీ—ఎవరికి వాళ్ళం గమ్మున ఊరుకున్నాం.

నాలుగు నెలల తర్వాత—

తనకు కాకినాడ బదిలీ అయినట్టు, శంకరం స్వంతంగా 'గేరేజ్' ప్రారంభించినట్టూ-శారద ఉత్తరం రాసింది. ఉత్తరంలో విశేషాలు విని - సింహాచలం అన్నాడు, "ఇల్లు అలకగానే పండగ కాలేదు, ముందున్నది ముసళ్ళ పండగ" అని.

○ ○ ○ ○

రాత్రి తొమ్మిది గంటలైంది.

టేప్ రికార్డర్‌ని ట్యూన్ చేసి, తమలపాకుల ప్లేటుతో వచ్చి కుర్చీలో కూర్చుంది శారద. పక్కన వాలుకుర్చీలో శంకరం దిన పత్రికని తిరగేస్తున్నాడు.

"మీకు గుర్తుందో లేదో. మన పెళ్ళిలో నా ఫ్రెండ్ సుమిత్ర వో సంగతి చెప్పింది. 'తోరణపు చిగుళ్ళు మేస్తున్న బలి పశువులా అదివ్వాళ ముసి ముసి నవ్వులతో మధురోహల్లో తేలిపోతూనే వుంటుంది'—అని మా నాన్న అన్నాడని, నాకెందుకో అవ్వాళ ఆయనన్నాడన్న మాటలే గుర్తొస్తున్నై."

తమలపాకు చిలకని అందుకుంటూ భార్య కళ్ళల్లోకి చూసేడు శంకరం.

'స్వామి ముందర వేసిన సాంబ్రాణి ధూపంలా వుందామె.

"ఇంకా ఆ ఆలోచనలని గుండెల్లో పెట్టుకుని బిగించుకోవద్దని చెప్పానా లేదా నేన్నీకు?" అన్నాడు శంకరం. చిరుకోపంలోనే లాలన ధ్వనించింది. అతను లేచి మంచంమీదికి చేరేడు.

'ఒక్క క్షణం.... ఒక్క క్షణం........ మోయలేని ఈ హాయిని మోయనీ....' పాట సాగుతోంది.

"మన పెళ్ళికి వచ్చిన దీవెనలు—వాళ్ళందరి తిట్లేగా. ఆ సంగతుల్ని మనం ఎంత త్వరగా మరిచిపోతే అంత మంచిది." శంకరం పక్కకి తిరిగి పడుకున్నాడు.

"ఎంత నిగ్రహించుకుందామనుకున్నా ఒక్కసారి మా అమ్మని చూసి వద్దామని పిస్తూనే వుంది." యథాలాపంగా అన్నది శారద.

"....పిచ్చి అంటారు దీన్నే...." తేలిగ్గా అనేసి సన్నగా నవ్వేడు శంకరం.

○ ○ ○

ఐదేళ్ళు గడిచినై.

నేను కాకినాడ వెళ్ళినప్పుడల్లా శారదని చూసి వస్తూనే వున్నాను.

శంకరం—శారదల కాపరం తేనెలా తియ్యగా సాగుతున్నట్టు నాకు అర్థమౌతూ వచ్చింది.

శంకరం తన 'ప్రొఫెషన్'ని చాలా వృద్ధి చేసుకున్నాడు. ఇంట్లోకి చాలా 'స్టేటస్ సింబల్స్' చేరినై కూడా. ఒకసారి నేను వెళ్ళినప్పుడు స్కూటర్ చూపించారు. మరోసారి వెళ్ళేసరికి ఫ్రిజ్ వచ్చింది. ఇంకోసారి చూస్తే 'ఏ. సి' సెట్టు తయారైంది.

వాళ్ళ దాంపత్యం పువ్వుకంటే తేలిగ్గా సుకుమారంగా పరిమళించిపోతున్నట్టు—ఆ దంపతుల మొహాల్లో మెరిసే తృప్తీ; కళ్ళల్లో విరిసే కాంతీ-సాక్ష్యం పలుకుతున్నై.

నేను కాకినాడ వెళ్ళి వచ్చినప్పుడల్లా సింహాచలం చాలా ఉత్సుకతతో శారద కాపరం గురించి ప్రశ్నలు వేసేవాడు. రంగారావూ తరచు ఉత్తరాలు రాస్తూ వున్నాడు— శారద సంగతులేవిటని విచారిస్తూ.

ఒక గాడిలో పోతున్న వాళ్ళ జీవన శకటానికి ఒక రాయి చక్రానికి తగిలింది

నాకా ఉత్తరం రాగానే హడావిడిగా కాకినాడకు ప్రయాణమయ్యాను. సింహాచలమూ కారెక్కేడు.

○ ○ ○

రంగారావూ – వసుంధరా; కాశీపతీ—వరమ్మా – సింహాచలం - గురునాథం—అందరూ శారద ఆరోగ్యం గురించి ఆందోళన పడుతున్నారు. వీళ్ళంతా చేరేసరికి శంకరం ఆమెని హాస్పటల్లో చేర్చేడు.

మొదటికాన్పు కష్టమైపోయింది. ఆపరేషన్ చేసి బిడ్డను బయటికి తీశారు. శారదకు మగబిడ్డ! పిల్లవాడు చాలా ఆరోగ్యంగా, దబ్బపండులా పుట్టాడు.

—శారద మామూలు మనిషయ్యింది.

ఒక రోజు రాత్రి—

అంతా, హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. శంకరంకి వాళ్ళందరి మొహాల్లోనూ ఏదో నిరుత్సాహం, కళ్ళల్లో అస్థిమితత్వం గోచరించినై. ఎవ్వరూ మనసు విప్పి మాట్లాడటం లేదని వాతావరణమే తెలుపుతోంది. ఈ బొమ్మలన్నీ ఒక మట్టితో తయారైనవే అనిపిస్తోంది - పరీక్షగా చూసిన కొద్దీ.

శంకరం గురునాథంతో అన్నాడు, "కాసేపు అలా ఆరుబయట కూర్చుందాం రండి" అని.

ఇద్దరూ వచ్చి బయట వేపచెట్టు క్రింద కూర్చున్నారు.

"మీ మామగారి ఇంటి ముందూ ఇలాగే వేప చెట్టు వుంది" అన్నాడు గురునాథం.

అదోలా నవ్వేడు, శంకరం.

క్షణాల తర్వాత అన్నాడు శంకరం, "చూడండి బావాయ్ గారు. వీళ్ళంతా మేమిద్దరమూ తమ అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్ళి చేసుకున్నామని శాపనార్థాలు పెట్టార్లు, గింజుకున్నారు, సంబంధాలు తెంచేసుకున్నారు. అయినా విచిత్రమైన విషయం వొకటి వుంది గమనించారో లేదో?"

అతను ఆగేడు. "ఏవిటది?" అడిగాడు గురునాథం.

"వాళ్ళ అంతరాంతరాల్లో వొక దొంగ కోరిక దోబూచులాడుతూ వుండనే వుంది. మేమిద్దరమూ, ఎక్కడ సుఖపడిపోతామో అనే ఆందోళన, భయం - మా కాపరం వొడిదుడుకుల పాలై మేమిద్దరమూ తెల్లజెండా ఎత్తేసి తమ కాళ్ళ మీద పడిపోతే బాగుండు నన్న సన్నటి ఆకాంక్ష. ఇదొక తమాషా 'కాంప్లెక్స్.' ఇవ్వాళిటి భయంకరమైన నిశ్శబ్దానికి, గంభీరమైన వాతావరణానికీ ఇదే కారణం కాదంటారా?"

'గురునాథం గతుక్కుమన్నాడు. మనసుల్ని చదివి ఇంత వివరంగా పాఠం చెప్పిన శంకరం కేసి కన్నెత్తి చూడలేకపోయాడు, పన్నెత్తి సమాధానమూ చెప్పలేకపోయాడు.

అయితే—శంకరం అక్కడున్న ఐదు గురికే అన్వయించి ఆ మాటలు చెప్పాడే కానీ—తన పట్ల మాత్రం అవి నిజం కావా అనే ప్రశ్న చటుక్కున గురునాథం మెదడులో మొలిచింది. లేకపోతే తన కాకినాడ ప్రయాణాల అంతర్యం ఏమిటీ?

గురునాథం నీడ వేపచెట్టు నీడలో కలిసిపోయింది.